ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర
సంపుటి : 13
సంచిక : 287
పేజీలు : 5 వెల రూ. 2/-
బుధవారం
19 నవంబర్ 2025
PUBLISHED FROM :
HYDERABAD
AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com


## తుదిదశకు శాసనమండలి పునరుద్ధరణ పనులు

పనులు పరిశీలించి సూచనలు చేసిన సీఎం రేవంత్



2లో

### వాట్సాప్‌లో

# మీ సేవ పోర్టల్

- నేరుగా పొందేలా అవకాశం
- ప్రారంభించిన తెలంగాణ ఐటి మంత్రి శ్రీధర్ బాబు..



2లో

### కేంద్రం నిర్దేశించిన లక్ష్యంలో

# మేమూ భాగస్వామ్యం

- 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీలో 10శాతం ఉంటాం..
- ఫ్యూచర్ సిటీ, ట్రిపుల్ ఆర్, మూసీ రివర్ ఫ్రంట్‌తో మార్పు
- వేగంగా అనుమతులు లభిస్తేనే పురోగతి సాధ్యం
- పట్టణాభివృద్ధి మంత్రుల ప్రాంతీయ సమావేశంలో రేవంత్ రెడ్డి..

వివరాలు 2లో




# అర్బన్ నక్సల్స్ ఉచ్చులో పడొద్దు

- బతికున్న వారు వెంటనే లొంగిపోవాలి
- కేంద్రమంత్రి బండి సంజయ్ హితవు



2లో

# పేరుమార్చి బనకచర్ల నిర్మాణం

- ఏపి తీరుపై పాటిల్ ముందు అభ్యంతరం
- ఢిల్లీలో తెలంగాణ మంత్రి ఉత్తమ్ వెల్లడి



2లో

# పత్తికి మద్దతు ధర ఇచ్చి కొనాలి

- ఢిల్లీకి వెళ్లి పత్తి సమస్యలు ప్రధానికి తెలిపాలి
- లేదంటే సిఎం ఇంటిముందే పత్తిపోసి ధర్నా చేస్తా
- వరంగల్ ఎనుమాముల మార్కెట్ సందర్శించిన హరీష్ రావు..

2లో



### మావోయిస్టులకు

# మరో ఎదురుదెబ్బ

- ఎన్‌కౌంటర్‌లో పార్టీ అగ్రనేత హిడ్మా హతం
- ఎదురుకాల్పుల్లో మొత్తం ఆరుగురు మావోల హతం



2లో

# కేంద్రం నిర్దేశించిన లక్ష్యంలో మేమూ భాగస్వామ్యం




ఏఎం న్యూస్, హైదరాబాద్,నవంబర్18:
హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడంతో పాటు కొత్త నగరాన్ని నిర్మించాలని భావిస్తున్నట్లు సిఎం రేవంత రెడ్డి వెల్లడించారు. ఫ్యూచర్ సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. తెలంగాణ రైజింగ్-2047 పేరుతో కొత్త ప్రణాళిక రూపొందించాం. ప్రపంచంలోనే ఆర్థికంగా ఎదిగిన దేశంగా భారత్‌ను అభివృద్ధి చేసేందుకు కేంద్రం కృషి చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాల్లో తెలంగాణ కూడా భాగమవుతుందన్నారు. అయితే తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టులకు కేంద్రం త్వరగా అనుమతులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు లభిస్తే హైదరాబాద్ అభివృద్ధి చెందుతుందని.. తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థలో మరింత కీలకంగా మారుతుందని చెప్పారు. హోటల్ ఐటీసీ కోహినూర్‌లో నైరుతి రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రుల ప్రాంతీయ సమావేశంలో సీఎం మాట్లాడారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరిస్తే దేశాభివృద్ధి మరింత వేగవంతమవుతుంది. కేంద్రం నిర్దేశించుకున్న 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీలో రాష్ట్ర వాటా 10 శాతం ఉండాలని భావిస్తున్నట్లు ఈ సందర్భంగా సిఎం వెల్లడించారు. జీడీపీలో ప్రధానంగా 5 మెట్రోపాలిటన్ నగరాలైన దిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ దేశానికి ఎంతో కీలకంగా ఉన్నాయి. కేంద్రం సహకరించకుంటే రాష్ట్రాల అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. హైదరాబాద్ మెట్రో రైలు, ఆర్‌ఆర్‌ఆర్, మూసీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాల్సి ఉందన్నారు దేశానికి పెద్దన్నగా ఉన్న ప్రధాని మోదీ సహకరిస్తే అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయి. మోదీ గుజరాత్ మోడల్ రూపొందించుకున్నట్లే మేం తెలంగాణ మోడల్ తీసుకొచ్చాం. ఆయన సబర్మతి నది ప్రక్షాళన చేపట్టినట్లే మేం మూసీ పునరుజ్జీవం చేస్తున్నాం. గుజరాత్‌కు మోదీ ఇచ్చిన సహకారాన్నే మేం తెలంగాణకు కోరుతున్నాం అని వివరించారు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రాజకీయాలు చేద్దాం అని రేవంత్‌రెడ్డి అన్నారు. తరవాత అభివృద్ధి గురించే మాట్లాడుతామని అన్నారు. అభివృద్ధిలో దూసుకు వెళ్లాలన్నదే తమ అభిమతమని అన్నారు. మా పోటీ ఇతర రాష్ట్రాలతో కాదని, టోక్యో, సింగపూర్ లాంటి వాటితోనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, ఏపీ మంత్రి పొంగూరు నారాయణ, గుజరాత్ మంత్రి కనుభాయ్ మోహన్‌లాల్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

ఏఎం న్యూస్, మారేడుమిల్లి,నవంబర్18:
మావోయిస్ట్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే అనేకమంది లొంగిపోగా, పలువురు అగ్రేతలు పోలీస్ తూటాలకు బలయ్యారు. తాజాగా మరో అగ్రనేత హిడ్మా సైతం నేలకొరిగాడు. వచ్చే మార్చి లోగా నక్సల్స్‌ను అంతం చేస్తామన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటనకు అనుగుణంగా ఆపరేషన్ కగార్‌తో బలగాలు దూసుకు పోతున్నాయి. తాజాగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎదురుకాల్పులు జరిగాయి. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు-మావోయిస్టుల మధ్య ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో మోస్ట్‌వాంటెడ్ మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు మద్వి హిడ్మా, ఆయన భార్య రాజే, అనుచరులు మల్లా, దేవే, చెల్లూరి నారాయణ అలియాస్ సురేశ్, టెక్ శంకర్ ఉన్నారు. హిడ్మాపై కోటి, ఆయన భార్యపై 50 లక్షల రివార్డు ఉన్నాయి. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి ఆ ప్రాంతంలో భద్రతా బలగాల కూంబింగ్ కొనసాగుతున్నట్లు ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై సమాచారం నేపథ్యంలో కూంబింగ్ నిర్వహించినట్లు చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పూర్వాటి గ్రామంలో జన్మించిన మద్వి హిడ్మా.. బస్తర్ ప్రాంతంలో దళంలో కీలక సభ్యుడిగా ఎదిగారు. చిన్నవయసులోనే మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడయ్యారు. గెరిల్లా దాడుల వ్యూహకర్తగా పేరుపొందారు. పీపుల్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కమాండర్‌గా, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగానూ పనిచేశారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలోనూ ఎదురుకాల్పులు జరిగాయి. మంగళవారం ఉదయం ఎర్రబోరు ప్రాంతంలో మావోయిస్టులు-భద్రతా బలగాల మధ్య జరిగిన కాల్పుల్లో ఓ మావోయిస్టు మృతిచెందాడు. ఆ ప్రాంతంలో ఎదురుకాల్పులు కొనసాగుతున్నట్లు జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. ఈ క్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో అగ్రనేత మద్వి హిడ్మా మృతి చెందారు. హిడ్మాతో పాటు ఆయన భార్య, అనుచరులతో కలిపి మొత్తం ఆరుగురు ఈ ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయారు. హిడ్మా ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పర్వతి గ్రామానికి చెందిన స్థానిక మురియా తెగకు చెందిన వ్యక్తి . 1981వ సంవత్సరంలో జన్మించిన హిడ్మా 10వ తరగతి వరకు మాత్రమే చదువుకున్నాడు. 2000 ప్రారంభంలో మావోయిస్ట్ ఉద్యమంలో చేరి, క్రమంగా అగ్రస్థానానికి ఎదిగాడు. ప్రస్తుతం సీపీఐ (మావోయిస్ట్), పీఎల్‌జీఏ బెటాలియన్ 1 కమాండర్‌గా దండకారణ్య ప్రాంతంలో (ఛత్తీస్‌గఢ్, బీజాపూర్, దంతేవాడ ప్రాంతాలు) పనిచేస్తున్నాడు. 2010లో జరిగిన దంతేవాడ దాడి (76 సీర్పీఎఫ్ సిబ్బంది హతం), 2013 జీరామ్ ఘాటి నరమేధం వంటి పలు పెద్ద దాడుల్లో ప్రధాన సూత్రధారి హిడ్మా అని ఆరోపణలు ఉన్నాయి. ఏడాది హిడ్మా సీపీఐ (మావోయిస్ట్) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సెక్రటరీగా పదోన్నతి పొందినట్లు పోలీసుల వద్ద సమాచారం ఉంది. హిడ్మాను పట్టుకోవడం కోసం పోలీసులు ఎంతగానో ప్రయత్నిస్తున్నారు. అతడి ఆచూకీ తెలిపిన వారికి బహుమతులు కూడా ప్రకటించారు. అడవుల భౌగోళిక పరిజ్ఞానం, గెరిల్లా యుద్ధ వ్యూహాలు, స్థానిక నెట్‌వర్క్‌లను ఉపయోగించడంలో హిడ్మా సిద్ధహస్తుడు. దీంతో అతడిని భద్రతా దళాలు చాలా కాలం పట్టుకోలేకపోయాయి 2004 నుంచి ఇప్పటివరకు అతను 20కి పైగా ప్రధాన దాడుల్లో పాల్గొన్నట్లు భద్రతా సంస్థలు అంచనా వేస్తున్నాయి. వేలాది మంది సిబ్బందితో పెద్ద ఎత్తున చేపట్టిన ఆపరేషన్లు కూడా హిడ్మాను పట్టుకోలేకపోయాయి. ఎట్టకేలకు మారేడుమిల్లి అటవీ ప్రాంతాల్లో హిడ్మా, అతడి అనుచరులు షెల్టర్ తీసుకున్నారనే విశ్వసనీయ సమాచారం పోలీసులకు చిక్కింది. భద్రతా బలగాలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో హిడ్మాతో సహా ఆరుగురు మరణించినట్టు పోలీసులు తెలిపారు.

### తెలంగాణ రాష్ట్రంలోనీ పలు ఇంజనీరింగ్ కాలేజీలు

## అక్రమంగా వసూలు చేస్తున్న డొనేషన్లు/ ఫీజులపై AICTE చైర్మన్‌కి ఫిర్యాదు

### తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జాక్ ఫౌండర్ వలిగొండ నరసింహ

ఏ ఎం న్యూస్ ఓయూ:
తెలంగాణ రాష్ట్రంలోనీ పలు ఇంజినీరింగ్ కళాశాలలు ఏఐసిటిఈ నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా డొనేషన్లు /ఫీజుల రూపంలో లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న అరోరా ,VNR, CVR, గీతాంజలి, గోకరాజు రంగరాజు, KMIT, నారాయ ణమ్మ, వర్ధమాన్ వంటి పలు ఇంజినీరింగ్ కళాశాల మీద నిబంధనల అనుసారం చర్యలు తీసుకోవాలని ఏఐసిటిఈ చైర్మన్ గారికి పిర్యాదు చేయడం జరిగింది. పైన పేర్కొన్న కళాశాలలో విద్యను వ్యాపారంగా చేసి నిరుపేద ఓసి , బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకి చెందిన విద్యార్థులను ఇంజినీరింగ్ విద్యకు దూరం చేస్తున్నారని తన పిర్యాదు లో పేర్కొన ఓయూ విద్యార్థి నాయకులు వలిగొండ నరసింహ తక్షణమే విచారణ చేసి ఆయా కాలేజీలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేయడం జరిగింది.



# పత్తికి మద్దతు ధర ఇచ్చి కొనాలి

ఏఎం న్యూస్, వరంగల్,నవంబరు18:
పత్తి రైతుకు మద్దతు ధర ఇవ్వకపోతే తెల్ల బంగారాన్ని రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ప్యాలస్ ముందు పోసి ఇంటిని ముట్టడిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీష్ రావు వార్నింగ్ ఇచ్చారు. మంగళవారం ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను హరీష్ రావు, బీఆర్ఎస్ నేతలు పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... పత్తి కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వైఖరితో రైతులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. సీసీఐ తుగ్లక్ చర్యల వల్ల రైతులు రోడ్డున పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు విధిలేక దళారులకు అమ్ముకుంటున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలను నిలువునా ముంచుతున్నాయని మాజీ మంత్రి విమర్శించారు. రేవంత్ రెడ్డి అరవైసార్లు ఢిల్లీకి వెళ్లారని.. మూటలు పంపుతు న్నారు గానీ రైతుల సమస్యలు బడేబాయ్‌కు చెప్పరా అని ప్రశ్నిం చారు. జూబ్లీహిల్స్‌లో విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు పెట్టారని.. మరి రైతులకు మద్దతు ధర ఇప్పించరా అంటూ నిలదీశారు. కపాస్ యాప్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎనిమిది మంది తెలంగాణ బీజేపీ ఎంపీలకంటే పంటపొలాల్లో దిష్టి బొమ్మలు నయమంటూ వ్యాఖ్యలు చేశారు. విదేశాల నుంచి పత్తి దిగుమతి చేసుకునేందుకు నిబంధనలు సడలించారని.. కానీ రైతులకు మాత్రం న్యాయం చేయడం లేదని మండిపడ్డారు. ఇప్పటి వరకూ 406 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. రైతులు కన్నీళ్లు పెట్టుకుంటుంటే సీఎం రేవంత్ రెడ్డి విజయోత్సవాలు జరుపుతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తుఫానుతో పంటలు నష్టపోయిన రైతులకు రేవంత్ రెడ్డి సర్కార్ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మేల్కొని రైతులకు న్యాయం చేయాలని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. కాగా.. హరీష్ రావుతో పాటు పత్తియార్డును బీఆర్ఎస్ నేతలు ఎర్రబెల్లి దయాకర్ రావు, మధుసూదనాచారి, చల్లా ధర్మారెడ్డి, మాలోత్ కవిత పరిశీలించారు. కాంగ్రెస్ పాలన లో కరెంటు నుంచి కాంట దాకా అన్నీ సమస్యలేనని ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. సమయానికి ఎరువులందవు, కరెంటు సరిగ్గా రాదు, రైతుబంధు రాదు, రుణమాఫీ లేదు, బోనస్, పంటల బీమా ఊసేలేదని మండిపడ్డారు. వరంగల్ డిక్లరేషన్‌లో చెప్పిన ఒక్క హామీ అయిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందా అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లు, కార్పొరేట్లకు లాభం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తుందని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి మేలుకోకపోతే తెల్ల బంగారం పత్తిని తెచ్చి జూబ్లీహిల్స్ ప్యాలెస్ ముందు పోస్తామని హెచ్చరించారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తుందన్నారు. వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌ని సందర్శించాక పత్తి రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. రాష్ట్రంలో పత్తి రైతులు తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారు. తెలంగాణలో 50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల, బీజేపీ తప్పుడు విధానాల వల్ల పత్తి రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. సీసీఐ తుగ్లక్ వంటి పిచ్చి నిర్ణయాలు తీసుకొని రైతులను ఇబ్బందుల గురి చేస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా జిన్నింగ్ మిల్లులన్నీ రెండు రోజులుగా మూతపడ్డాయి. పత్తి రైతులంతా అయోమయం లో ఉన్నారు. ఈరోజు రైతులకు పత్తిని అమ్ముకోవడానికి అవ కాశం లేక అడ్డగోలుగా దళారులకు అమ్ముకునే పరిస్థితి వచ్చింది. పత్తికి మద్దతు ధర రూ. 8,100. కానీ, రూ.6 వేలకే రైతులు అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. క్వింటాల్ మీద రూ.2000ల చొప్పున పత్తి రైతులు నష్టపోతున్నారు. మాటల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరచేతిలో వైకుంఠం చూపించి, చేతల్లో నరకం చూపిస్తున్నాయని అన్నారు. వరదలు, తుఫాన్‌ల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతే తుగ్లక్ నిర్ణయాలతో మరింత ఇబ్బంది పెట్టడం సరికాదు. ఒకవైపు అకాల వర్షాలతో పంట దిగుబడి తగ్గిపోయింది. పంట చేనులన్నీ దెబ్బతిన్నాయి. పెట్టిన పెట్టుబడులు రాక రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చింది. ఎల్ వన్, ఎల్ టు, ఎల్ త్రీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. 8 నుంచి 12 శాతం తేమ విధానాన్ని సవరించి, కపాస్ యాప్‌ని రద్దు చేయండి. స్మార్ట్ ఫోన్లు లేకపోవ డం వల్ల కపాస్ యాప్‌లో నమోదు చేయడం రైతులకు కష్టమైన పని. గత సంవత్సరం లాగానే 12 క్వింటాల పత్తి కొనాలని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. బీజేపీ ఎంపీలు ఒక్కసారి కూడా నోరు విప్పరు. రైతుల గురించి కేంద్ర ప్రభుత్వాన్ని అడగరు. కేసీఆర్‌ని, బీఆర్ఎస్‌ని తిట్టడం తప్ప బీజేపీ ఎంపీలకు మరో పని చాతకాదు. కాంగ్రెస్ ప్రశ్నించదు. బీజేపీ అడగదు అంటూ మండిపడ్డారు. రైతులను తీవ్రంగా ఇబ్బందులు పెట్టినందుకు విజయోత్సవాలు చేస్తున్నా రా?. యూరియా బస్తాల కోసం రైతులను లైన్‌లో నిల్చోపెట్టినం దుకు విజయోత్సవాలా?. ములుగు నియోజకవర్గంలో చింతకుంట, మంగపేట మండలాల నుంచి వచ్చిన రైతు వెంకటేశ్వర్లు, రైతు లక్ష్మయ్య మక్కలు అమ్మ డానికి ఎనుమాముల మార్కెట్‌కి వచ్చారు. క్వింటల్ మక్కలు రూ. 1800 కు రైతులు అమ్ముతున్నారు, రూ.2400 మక్కకు మద్దతు ధర. మక్క రైతులు ఒక క్వింటాలకు రూ.570 నష్టపోతున్నారు.

### జనసేన పార్టీని నియోజకవర్గ స్థాయిలో విస్తృతపరచాలి

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :




రానున్న గ్రేటర్ ఎన్నికల్లో నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో పార్టీని విస్తృత స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని జనసైనికులకు, వీర మహిళలకు జనసేన పార్టీ అధిష్టానం సూచించింది. రాష్ట్ర నాయకులు హైదరాబాద్ కూకట్ పల్లి జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ జనసేన అధ్యక్షుడు రాదారం రాజలింగం, పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సమావేశంలో పెద్ద సంఖ్యలో జనసైనికులు, వీర మహిళలు పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా రాజలింగం మాట్లాడుతూ రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు పార్టీకి అత్యంత కీలకమైనవని పేర్కొన్నారు. ప్రతి డివిజన్‌లో పార్టీ బలోపేతం స్థానిక సమస్యలలో వున పరిస్థితులను విశ్లేషించాలి అన్నారు. ఇంటింటికి ప్రచారం ద్వారా పార్టీ సిద్ధాంతాలను ప్రజలలోకి చేరవేయాలని సూచించారు. యువత,వీర మహిళలు, కాలనీవాసులందరికీ చేరువయ్యేలా సమాజ సేవా కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే పార్టీ రాష్ట్ర నాయకత్వం నుంచి వచ్చిన సూచనల మేరకు, రానున్న రోజుల్లో ప్రత్యేకమైన శిక్షణ తరగతులు, కోర్ కమిటీ మీటింగ్స్, బూత్ స్థాయి సమీకరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పార్టీ కార్యకలాపాలను మరింత వేగవంతం చేసి, గ్రేటర్ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తామని సంకల్పం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వీర మహిళ ఛైర్మన్ కావ్య, జనరల్ సెక్రటరీ దామోదర్ రెడ్డి, కుకట్ పల్లి ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్, గ్రేటర్ హైదరాబాద్ లోని వివిధ నియోజకవర్గ డివిజన్ కోఆర్డినేటర్లు, ప్రెసిడెంట్లు, కార్యవర్గ సభ్యులు, జనసైనికులు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ రాష్టంలో రాష్ట్ర త్రోబాల్ సంబంధించిన కమిటీలను పూర్తిస్థాయిలో రద్దు చేశాం...

### టీపీసీసీ అధికార ప్రతినిధి, తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ సెవెన్ సైడ్ అధ్యక్షులు సత్యం శ్రీరంగం...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



త్రోబాల్ ఫెడరేషన్ అఫ్ ఇండియా తెలంగాణ రాష్టంలో త్రోబాల్ అసోసియేషన్ సెవెన్ సైడ్ భవిష్యత్తు, పటిష్టత కొరకు త్వరలో నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలియజేస్తూ గతంలో ఉన్న త్రోబాల్ సంబంధించిన అన్ని కమిటీలను తెలంగాణ రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షులుగా రద్దు చేసినట్లు డాక్టర్ సత్యం శ్రీరంగం వెల్లడించారు. త్రోబాల్ ఫెడరేషన్ అఫ్ ఇండియా అధ్యక్షులు రామన్ కుమార్ సాహ్ని, జనరల్ సెక్రటరీ గౌతమ్ కుమార్ సింగ్ సూచనలు, సహాయ సహకారాలతో తెలంగాణ క్రీడాకారుల పటిష్టత, భవిష్యత్తు కోసం రాష్ట్ర వ్యాప్తంగా త్రోబాల్ క్రీడాభివృద్ధికి తోడ్పడుతామన్నారు. ఏళ్ల తరబడి జనరల్ బాడీ మీటింగ్‌లు జరగకపోవడం, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించకపోవడం, కార్యదర్శి ఏకపక్షంగా సభ్యులను తొలగించడం, అంకితభావంతో పనిచేసే సభ్యులను పక్కన పెట్టే ప్రయత్నాలు జరిగాయన్నారు. క్రీడాకారుల సంక్షేమంపై దృష్టి పెట్టకపోవడం, క్రీడపై సాంకేతిక అవగాహన లేకపోవడం, అలాగే త్రోబాల్ ఫెడరేషన్ అఫ్ ఇండియా (టి ఎఫ్ ఐ) నిబంధనలు పాటించకుండా అనుబంధ రుసుములు కూడా చెల్లించకపోవడం వంటి తీవ్రమైన అవకతవకలు జరుగుతున్నాయనే కారణాలతో కేంద్ర కమిటీ సూచనల మేరకు అన్ని కమిటీలను రద్దు చేయడం జరిగిందని అన్నారు. అదే విధంగా తెలంగాణ రాష్టంలో భవిష్యత్ లో త్రోబాల్ క్రీడాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహాయ సహకారతో ముందుకు తీసుకుపోతామని టీపీసీసీ అధికార ప్రతినిధి, తెలంగాణ రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ సెవెన్ సైడ్ అధ్యక్షులు డా. సత్యం శ్రీరంగం తెలిపారు.

# అర్బన్ నక్సల్స్ ఉచ్చులో పడొద్దు

ఏఎం న్యూస్, వేములవాడ,నవంబర్18:
అర్బన్ నక్సల్స్ పట్టణాల్లో జల్సా చేస్తున్నారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. మావోయిస్టుల మరణాలకు అర్బన్ నక్సల్స్ కారకులని తెలిపారు. నక్సల్స్‌కు సపోర్ట్ చేసిన అర్బన్ నక్సల్స్ ద్రోహులని అభివర్ణించారు. తక్షణమే తుపాకీ వీడి జన జీవన స్రవంతిలో కలవాలని మావోయిస్టులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచించారు. వారిని చూసి మోసపోవద్దంటూ ప్రజలకు ఆయన స్పష్టం చేశారు. మంగళవారం వేములవాడలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. పైరవీలు చేసుకుంటూ ఆస్తులు పోగేసుకుంటున్నారని అర్బన్ నక్సల్స్‌పై నిప్పులు చెరిగారు. వారి మాటలు నమ్మి అమాయక,పేద ప్రజలు తుపాకీ పట్టి అడవుల్లో తిండి తిప్పలు లేకుండా తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో 4 నెలల గడువు మాత్రమే ఉదంటూ ఈ సందర్భంగా మావోయిస్టులకు ఆయన గుర్తు చేశారు. వచ్చే మార్చి నాటికి మావోయిజాన్ని అంతం చేసి తీరుతామని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారేడుమిల్లి ఏజెన్సీ ప్రాంతంలో మంగళవారం తెల్లవారుజామున భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. దీనిలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, అగ్రనేత హిడ్మాతోపాటు పలువురు మావోయిస్టులు మరణించారు. వారి మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం రంప చోడవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంతో ఆ ప్రాంతంలో భారీగా పోలీసులను మోహరించారు. మరోవైపు 2026 మార్చి నెలాఖరు నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలిస్తామని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆపరేషన్ కగార్‌ను తెరపైకి తీసుకు వచ్చి.. మావోయిస్టులు లక్ష్యంగా వారి ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా బలగాలతో కూంబింగ్ నిర్వహిస్తోంది. దాంతో వేలాది మంది మావోయిస్టులు మరణించారు. వందలాది మంది ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. భారీగా మావోయిస్టులను అరెస్ట్ చేశారు. మార్చి నెలాఖరు నాటికి మావోయిస్టులను నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్రం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో బండి వ్యాఖ్యలు ప్రాధన్యం సంతరించుకున్నాయి.

# పేరుమార్చి బనకచర్ల నిర్మాణం

ఏఎం న్యూస్, న్యూఢిల్లీ,నవంబర్18:
పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం పేరు మార్చి చేపడుతోందని, ఆ ప్రాజెక్టును పూర్తిగా వ్యతిరేకించామని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి పాటిల్‌తో భేటీ అనంతరం దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీ ప్రాజెక్టును మహారాష్ట్ర, కర్ణాటక కూడా వ్యతిరేకిస్తున్నాయి. ఆ ప్రాజెక్టును పరిగణనలోకి తీసుకోవద్దని కేంద్రమంత్రిని కోరామని తెలిపారు. ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచేందుకు భూసేకరణ కోసం కర్ణాటక జీవో జారీ చేసింది. 519 మీటర్లకంటే ఎక్కువ ఎత్తు పెంచవద్దని సుప్రీంకోర్టు స్టే ఉంది. స్టే ఉండగానే కర్ణాటక ప్రభుత్వం ఎత్తు పెంచేందుకు చర్యలు చేపట్టింది. కర్ణాటక ప్రభుత్వం తెచ్చిన జీవోను కేంద్రజల్‌శక్తి మంత్రి దృష్టికి తీసుకెళ్లాం. తెలంగాణలోని పలు ఇరిగేషన్ ప్రాజెక్టులను నిధులివ్వాలని కోరామని అన్నారు. మా ప్రభుత్వంలో కేఆర్ఎంబీ టెలిమెట్రీ స్టేషన్ పనుల్లో పురోగతి వచ్చింది. కేఆర్ఎంబీ టెలిమెట్రీ స్టేషన్ పనులు త్వరగా పూర్తి చేయాని అడిగాం.. మరో 20 టెలిమెట్రీ స్టేషన్ల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఫేజ్-2లో 9, ఫేజ్-3లో 11 నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

## తుదిదశకు శాసనమండలి పునరుద్ధరణ పనులు

ఏఎం న్యూస్, హైదరాబాద్,నవంబర్18:
శాసనమండలి భవనం పనులు చివరిదశకు చేరాయి. పాత శాసనసభ భవనాన్ని అందంగా తీర్చి ముస్తాబు చేస్తున్నారు. దీంట్లో మండలి కార్యకలాలపు జరుగనున్నాయి. దీంతో రెండు సభలు ఒకే ప్రాంగణంలోకి అందుబాటులోకి రానున్నాయి. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో కలిసి అసెంబ్లీ ఆవరణలోని శాసన మండలి మరమ్మతు పనులు పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. పనులను సమీక్షించిన సిఎం పలు సూచనలు చేశారు. తుదిదశకు చేరుకున్న పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు మండలిని జూబ్లీహాల్‌లో నిర్వహిస్తున్నారు. దీంతో మండలికి వెళ్లాలంటే మంత్రులకు ఇబ్బందికరంగా మారింది. అలాగే ఏదైనా సమావేశం నిర్వహించేందుకు గతంలో జూబ్లీహాల్‌ను ఉపయోగించేవారు. తిరిగి దానిని పాతపద్దతిలో పునరుద్ధరించే అవకాశాలు ఉన్నాయి. అసెంబ్లీ కార్యదర్శ నరసింహాచార్యులు పలువురు అధికారులు కూడా స్పీకర్ వెంట వచ్చారు.

# వాట్సాప్‌లో మీ సేవ పోర్టల్

ఏఎం న్యూస్, హైదరాబాద్,నవంబర్18:
రాష్ట్రంలో మీ సేవ సేవలు అందుబాటులోకి వచ్చాక కుల, ఆదాయ వంటి ఇతరత్రా సర్టిఫికెట్స్ పొందడం ఈజీ అయిపోయింది. అయితే ఈ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై పదే పదే మీ-సేవ కేంద్రాలకు వెళ్లే శ్రమ తగ్గించడానికి, మీ-సేవకు సంబంధించిన అన్ని సేవలను ఇకపై వాట్సాప్ ద్వారానే అందించనుంది. తెలంగాణలో ఇకపై వాట్సాప్‌లోనే మీ-సేవ సర్టిఫికెట్లు అందనున్నాయి. వాట్సాప్ మీసేవ సర్వీసులను(మీ సేవ సర్వీసెస్ ఆన్ వాట్సాప్) బంజారాహిల్స్ లోని తాజ్ కృష్ణలో మంత్రి శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు. 38 ప్రభుత్వ విభాగాలకు చెందిన 580కి పైగా మీ సేవా సర్వీసులను వాట్సాప్ ద్వారా పొందే విధంగా ఏర్పాట్లు చేశారు. మెటా, మీ సేవ సంయుక్త భాగస్వామ్యంతో ఈ సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. మీ సేవ సెంటర్స్ చుట్టూ తిరిగే పని లేకుండా సేవలను సులభతరం చేసింది తెలంగాణ ప్రభుత్వం.. వినియోగదారులు వాట్సాప్ లోనే సర్టిఫికెట్స్ పొందే అవకాశం కల్పించింది. మీ-సేవ సెంటర్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత దానికి సంబంధించిన తాజా అప్‌డేట్స్ అన్నీ వాట్సాప్‌లోనే చెక్ చేసుకోవచ్చు. అంతేకాకుండా దరఖాస్తు చేసిన సర్టిఫికెట్ ఆమోదం పొందితే ఆ సర్టిఫికెట్‌ను సైతం వాట్సాప్ ద్వారానే డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. 8096958096 వాట్సాప్ నెంబర్ ద్వారా మీ సేవ సర్వీసెస్ ఉపయోగించుకోవచ్చు. ఇన్కమ్ సర్టిఫికెట్, బర్త్ సర్టిఫికెట్, డెత్ సర్టిఫికెట్, రెసిడెన్సీ సర్టిఫికెట్, కమ్యూనిటీ / డేట్ ఆఫ్ బర్త్, పోలీస్ చలాన్, రెన్యువల్ ఆఫ్ రేషన్ షాప్స్, టెంపుల్ సర్వీసెస్, బిల్డింగ్ పర్మిషన్, వెహికిల్ లైఫ్ ట్యాక్స్, లైసెన్స్, ప్రాపర్టీ ట్యాక్స్ సేవలు ఇక వాట్సాప్ లోనే పొందొచ్చు. త్వరలోనే మరిన్ని వాట్సాప్ సర్వీసులను ప్రారంభించనున్నది ప్రభుత్వం.. వాట్సాప్ లో 580 ప్రభుత్వ సర్వీసెస్ ను అందించడానికి ప్రభుత్వ ప్రణాళికలు చేస్తోంది.

### పీజీ విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో

# వెంటనే రిజల్ట్స్ విడుదల చేయాలి

### - ఎబివిపి ఉస్మానియా యూనివర్సిటీ కార్యదర్శి శివశంకర్

ఏ ఎం న్యూస్ ఓయూ:



పీజీ విద్యార్థుల పరిస్థితి అఘోరంగా మారుతోంది. దాదాపు ఐదు సంవత్సరాలుగా అకాడమిక్ ఇయర్ నిరంతరం జాప్యం అవుతూ వస్తోంది. అధికారులు ప్రతి సంవత్సరం మేము అకడమిక్ ఇయర్ నీ సర్దుబాటుకు ప్రయత్నిస్తున్నాం అని చెబుతున్నప్పటికీ, ఫలితంగా ప్రతి సంవత్సరం మరింత జాప్యం చేసి విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు . అకడమిక్ ఇయర్ సర్దుబాటు చేయకపోవడం వల్ల విద్యార్థులు ఉద్యోగ అవకాశాల్లో ,ఉన్నత చదువులకు ఇతర యూనివర్సిటీలకు, ఇతర రాష్ట్రాలకు, లేదా విదేశాలకు వెళ్లి చదవాలన్నా, అక్కడి అడ్మిషన్ సమయానికి మన యూనివర్సిటీలో ఎగ్జామ్స్ పూర్తికాకపోవడం, రికార్డులు రెడీ కాకపోవడం వల్ల విద్యార్థులు అవకాశం కోల్పోతున్నారు. ఇంకా ఆలోచించవలసిన విషయం ఏమనగా పరీక్షలు పూర్తి అయ్యి 45 రోజుల్లో రావాల్సిన సెమిస్టర్ ఫలితాలు ఎగ్జామ్స్ పూర్తయ్యి మూడు నెలలు కావొచ్చినా ఇప్పటికీ విడుదల కాలేదు. ఇది అత్యంత బాధాకరం. దీని వలన విద్యార్థులకు వచ్చిన ఉద్యోగ అవకాశాలకు వెళ్లలేకపోవడం, రిజల్ట్స్ తెలియక కొత్త నోటిఫికేషన్లకు దరఖాస్తు చేసుకోలేకపోవడం వంటి సమస్యలు తీవ్రమవుతున్నాయి. సమయానికి ఫలితాలు రాకపోవడం వలన వారి భవిష్యత్తు అంధకారం అవుతోంది. ఈ పరిస్థితుల్లో విద్యార్థులు మనస్థాపానికి గురైతున్నారు. సరైన సమయానికి పరీక్షలు, ఫలితాలు ఇవ్వకపోవడం ప్రతి విద్యార్థినీ ఇబ్బందుల్లోకి నెడుతోంది.కాబట్టి, ఇప్పటికైనా శ్రద్ధ చూపించి, వెంటనే పెండింగ్‌లో ఉన్న రిజల్ట్స్ విడుదల చేయాలని అధికారులను డిమాండ్ చేస్తున్నాం.

## కెపిహెచ్బి కాలనీ డివిజన్లో జరిగే

# బహుళ అంతస్తుల భవన నిర్మాణాల్లో ఉల్లంఘనలు..

- నివాసం పేరిట అనుమతి తీసుకొని అక్రమంగా వాణిజ్య భవనాల నిర్మాణం
- అధికారుల పనితీరుతో మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి
- అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
- టౌన్ ప్లానింగ్ అవినీతి అధికారుల తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు



**ఏ ఎం న్యూస్, కూకట్పల్లి:**
కూకట్ పల్లి సర్కిల్ పరిధిలోని కెపిహెచ్బి డివిజన్ వసంత నగర్ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలు విచ్చల విడిగా వెలుస్తున్నాయి. తీసుకున్న అనుమతులకు మించి పూర్తి విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనం నిర్మించినా, రెసిడెన్షియల్ భవనం పేరిట అనుమతి తీసుకొని కమర్షియల్ భవనం నిర్మిస్తున్నా పట్టించుకున్న నాధుడే లేడు. ఇక్కడి ప్రధాన రహదారిలో బహిరంగంగా రెండు చోట్ల పెద్దపెద్ద భవనాలు నిర్మాణ దశలో ఉన్నప్పటికీ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. తాంబూలాలిచ్చేశాం తన్నుకు చావండి అన్నట్లుగా ఉన్నది కూకట్ పల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ తీరు. భవన నిర్మాణాలకు, అనుమతులు ఇచ్చేసి ఆ తర్వాత నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేస్తున్నారా? లేదా అన్న అంశాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు అది తమ బాధ్యత కాదని అన్నట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇక్కడి అధికారుల పనితీరు చూస్తే అనుమతుల ప్రకారం సదరు నిర్మాణదారులు భవన నిర్మాణాలు చేపడుతున్నారా లేదా అనేది మచ్చుకైనా కనిపించడం లేదు. కళ్ల ముందే అక్రమ నిర్మాణాలు కనిపిస్తున్నా, అక్రమ కట్టడాలపై ఎవరైన ఫిర్యాదు చేసినా టౌన్ ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి.

**నివాసం పేరిట అనుమతి తీసుకొని యదేచ్ఛగా వాణిజ్య భవనాల నిర్మాణం...**
కెపిహెచ్బి డివిజన్ పరిధిలోని వసంత నగర్ కాలనీ, భగత్ సింగ్ నగర్, సర్దార్ పటేల్ నగర్, గోపాల్ రావు నగర్, ధర్మారెడ్డి కాలనీ ఫేస్ 5 6, 7, 9, కాలనీ లలో అడ్డగోలుగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారుల నుండి దొడ్డిదారిలో రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని కమర్షియల్ నిర్మాణాలు చేపడుతున్నారు. నిర్మాణదారుల నుండి అందిన కాడికి దండుకుంటున్న అధికారులు నిర్మాణాల విషయంలో చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో కమర్షియల్ నిర్మాణాలు చేపట్టడంతో సమీప ప్రాంతాల ఆవాసులు ఇబ్బందులు పడుతున్నారు. తమ నివాస ప్రాంతాలలో భద్రత, శాంతి మెరుగైన జీవనశైలిని ఉండాలని కోరుకున్నప్పటికీ గృహ ప్రాంతాలలో వాణిజ్య కార్య కలాపాలు కొన్నిసార్లు పర్యావరణానికి విఘాతం కలిగించే ప్రమా దం ఉందని పేర్కొంటున్నారు. నివాస ప్రాంతాలలో వాణిజ్య సంస్థల చట్టవిరుద్ధ కార్యకలాపాలు తరచుగా కాలుష్యం, ట్రాఫిక్, అధిక శబ్దం ఆక్రమణలకు దారితీస్తాయనీ పేర్కొంటున్నారు. రెసిడెన్షియల్ అనుమతుల భవనాల్లో కమర్షియల్ వాటికి ఉపయోగించడం నిబంధనలకు విరుద్ధం అయినప్పటికీ అధికారులు వ్యాపారులతో కుమ్మక్కై కాసులకు కక్కుర్తిపడి చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. కమర్షియల్ భవనాల అనుమతులు తీసుకుంటే ప్రభుత్వానికి భారీగా ఆదాయం కూడా వస్తుంది. కాని, అక్రమార్కులు ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు.

**అక్రమ నిర్మాణాల విషయంలో పట్టించుకోని టాస్క్ ఫోర్స్ అధికారులు....**
అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందాలు ఉంటాయి. బస్తీలు, కాలనీల్లో పర్యటిస్తూ అలాంటి నిర్మాణాలు కనిపిస్తే జోనల్ కమిషనర్‌కు తెలియజేయాలి. ఆ తర్వాత వాటిపై చర్యలు తీసుకోవాలి. కానీ ధనార్జనే ధ్యేయంగా పెట్టుకున్న కొందరు న్యాక్ ఇంజినీర్లు నోటీసులు ఇచ్చి నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న నిర్మాణదారుల నుండి వసూళ్లకు పాల్పడుతున్నారు. దీంతో సదరు నిర్మాణదారులు స్థానికంగా అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

**స్థానికుల ఫిర్యాదులను బుట్ట దాఖలు చేస్తున్న అధికారులు...**
స్థానికంగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. నిబంధనలు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలపై స్థానిక కాలనీవాసులు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు ప్రజావాణి ద్వారా ఫిర్యాదు చేసినప్పటికీ సంబంధిత అధికార యంత్రాంగం ఫిర్యాదులను బుట్ట దాఖలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికార యంత్రాంగం చొరవ తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

## కూకట్పల్లి పాత శివాలయంలో ఘనంగా కార్తీకమాస వేడుకలు
## ప్రత్యేక పూజలు చేసిన బండి రమేష్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు



**ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :**
కార్తీక మాసం సందర్భంగా కూకట్పల్లి లోని శ్రీ బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో (పాత శివాలయం) శివపార్వతుల కళ్యాణం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ తో సీనియర్ నాయకులు గుట్టిముక్కల వెంకటేశ్వరరావు కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రామాలయం రేనోవేషన్ కమిటీ సభ్యులు టాకిల్ శ్రీనివాస రావు, మేకల సుదర్శన్, రాజు యాదవ్, రాము, శ్రీనివాస్, కృష్ణవేణి, నాగమణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ సంఘాలు అభివృద్ధిపై దృష్టి సారించాలి

**ఇందిరా నగర్ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులను అభినందించిన ఎమ్మెల్యే కృష్ణారావు**



**ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :**
సంక్షేమ సంఘాల నిర్వాహకులు అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కూకట్పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. కూకట్పల్లి నియోజక వర్గం పరిధిలోని ఇందిరా నగర్ సంక్షేమ ఎన్నికల్లో విజయం సాధించిన కమిటీ సభ్యులను కృష్ణారావు ఆయన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. నూతన సంక్షేమ సంఘం అధ్యక్షులు సిహెచ్.గిరిసాగర్, ప్రధాన కార్యదర్శిగా కే.పరుశరాం, కోశాదికారి ఎమ్.చక్రవర్తి లతోపాటు కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. నూతన నూతనంగా ఎన్నికైన కమిటీ వారు బస్తీ సంక్షేమం అభివృద్ధి కోసం పాటుపడాలని తాను కమిటీకి ఎల్లవేళలా అందుబాటులో ఉండి సహాయ సహకారాలు పూర్తిస్థాయిలో అందిస్తానని కృష్ణారావు హామీ ఇచ్చారు. అనంతరం ఇందిరా నగర్ సంక్షేమ సంఘం సభ్యులు కూకట్పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ను, బాలనగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ను మర్యాదపూర్వకంగా కలిశారు.

## చేవెళ్ల నియోజకవర్గంలో టిఆర్‌పి ముఖ్య నాయకుల సమావేశం



**ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :**
తెలంగాణ రాజ్యాధికార పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ బండారి రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గ టీఆర్పీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమా వేశంలో పార్టీ భవిష్యత్ కార్యక్రమాలు, పార్టీ బలోపేతం, చేవెళ్ల నియోజకవర్గ కమిటీ, మండల కమిటీలు గ్రామ కమిటీల ఏర్పాటుపై విస్తృత స్థాయిలో చర్చలు నిర్వహించారు. చేవెళ్ల టీఆర్పీ నాయకుల సూచనలు, సలహాలను సమగ్రంగా స్వీకరించారు. ఈ సందర్భంలో న్యాయవాది షేక్ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ బీసీల ఐకమత్యం కావాలనీ అందరి ఐక్యతతో రాజ్యాధికారం సాధించాలని పిలుపునిచ్చారు. ఈ సమా వేశంలో టీఆర్పీ ముఖ్య నాయకులు జనార్దన్, శబరి గారి రాజు, ఇంటూరి ఆంజనేయులు, ఊరడి వెంకటేష్, కె. పంటయ్య గౌడ్, కావలి శంకర్, బి. వెంకటేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

### అన్నప్రసాదాన్ని భక్తులకు వడ్డించిన
## మాజీ కార్పొరేటర్ జి. సంజయ్ గౌడ్

**ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :**





యూసఫ్ గూడా డివిజన్ పరిధిలోని ఎల్ ఎన్ నగర్(లక్ష్మీనరసింహ నగర్) లో పిజేఆర్ గ్రౌండ్ పక్కనే ఉన్న శ్రీ శ్రీశ్రీ కట్టమైసమ్మ అమ్మవారి ఆలయంలో కమిటీ వారి నిర్ణయం మేరకు జరిగిన వనభోజన (అన్న ప్రసాద వితరణ కార్యక్రమం) కార్యక్రమం లో కమిటీ సభ్యుల ఆహ్వాన మేరకు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు గుర్రం సంజయ్ గౌడ్. ముఖ్య అత్యధిక వచ్చిన సంజయ్ గౌడ్ కి శాలువాతో ఘనంగా సన్మానించి, ఆలయ పంతులచే తీర్థ ప్రసాదాలు అందజేశారు కమిటీ సభ్యులు. తర్వాత జరిగిన అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా తానే వడ్డించి, అమ్మవారి కరుణాకటాక్షాలకు పాత్రులు అయ్యారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

## మొదటి పటాలములో
## కార్తీక మాస వనభోజనాలు ఘనంగా జరిగాయి



**ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :**
యూసఫ్ గూడా డివిజన్ (జూబ్లీహిల్స్ నియోజకవర్గం) పరిధిలోని చెక్ పోస్ట్ వద్ద ఉన్న మొదటి పటాలము (పోలీస్ లైన్ గా పిలవబడే) ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవాలయంలో మంగళవారం మాస శివరాత్రి సందర్భంగా అన్న ప్రసాద్ వితరణ( కార్తీకమాస వనభోజనాలు) కార్యక్రమం ఘనంగా జరిపారు ఆలయ కమిటీ సభ్యులు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్ మాట్లాడుతూ ఈరోజు ఉదయం ఆలయంలో విశేష పంచామృత విశేషాలు జరిగాయని, అన్న పూజ, అన్న అలంకరణ జరిగిందని, లక్ష బిల్వార్చన పూజ మహిళా భక్తులచే శ్రీ సామూహిక లలితా సహస్రనామం కుంకుమ పూజలు జరిగాయని అన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు కమిటీ వారిచే నిర్ణయించబడ్డ అన్న ప్రసాద వితరణ(కార్తీక మాస వన భోజనాలు ) కార్యక్రమం దేవాలయ ప్రాంగణం లో ఘనంగా జరిపారు,కమిటీ సభ్యులు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అభిలాష్ బిస్త్(డీజీపీ ), ఎం. రమేష్(ఐ జి, పి &ఎల్ ), పి మురళీకృష్ణ ( మొదటి పటాలము కమాండెంట్ ), రామకృష్ణ (స్టాఫ్ ఆఫీస్ టీజిఎస్పి ) లు పాల్గొని స్వామి వారి ఆశీర్వాదం తీసుకుని, అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు . ఈ కార్యక్రమంలో డిఎస్పీలు,ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా సందర్భంగా ఆర్ఐ సాంబయ్య మాట్లాడుతూ చుట్టుపక్కల ప్రాంతాలైన శ్రీకృష్ణ నగర్, వెంకటగిరి, హైలం కాలనీ,స్రవంతి నగర్, లక్ష్మీనరసింహనగర్,చెక్ పోస్ట్ నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు అని, వారితో పాటు పోలీస్ లైన్ లోని అధికారుల కుటుంబాలు, సిబ్బంది కుటుంబాలు, పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు అని తెలిపారు. ఆలయ కమిటీ వచ్చిన ముఖ్య అతిథులకు ఆలయ ప్రధాన పంతులు ప్రసాద్ చే ప్రత్యేక పూజలు జరిపించి వారికి( ముఖ్య అతిథులకు ) స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు


### తీసివేస్తారా, పునరుద్ధరిస్తారా
## అని అంటున్న ప్రయాణికులు, స్థానికులు



**ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :**
యూసఫ్ గూడా డివిజన్( జూబ్లీహిల్స్ నియోజకవర్గం )పరిధిలోని చెక్ పోస్ట్ వద్ద గల బస్ స్టాప్ పక్కనే ఉన్న మరుగుదొడ్డి ( టాయిలెట్) అధ్వానంగా పనికి రాకుండా దుర్వాసన వస్తుందని స్థానికులు, ప్రయాణికులు తెలిపారు అదేవిధంగా బస్ స్టాప్ లో బస్సు కోసం వేసే ప్రయాణికుల కు బస్సు కొంత ఆలస్యమైతే వేచి చూడాల్సిన పరిస్థితి ఉన్నప్పుడు ఈ మరుగుదొడ్డి నుంచి వచ్చే దుర్వాసన వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు ఏది ఏమైనా సంబంధిత అధికారులు పట్టించుకోని ఈ మరుగుదొడ్డి ని ఉంచుతారా లేదా పునరుద్ధరిస్తారా అని అడుగుతున్నారు ప్రయాణికులు, స్థానికులు. ప్రయాణికురాలు లావణ్య మాట్లాడుతూ నూతనంగా మరుగదొడ్డి ఏర్పాటు చేస్తే మంచిదని లేకపోతే ఉన్న టాయిలెట్ ని ఇక్కడి నుంచి తీసివేయాలని కోరుతున్నారు. ప్రయాణికురాలు రాములమ్మ మాట్లాడుతూ పరిమిత చార్జీలు తీసుకుని మరుగుదొడ్డిని ఉపయోగంలోకి తీసుకురావాలని, లేదా ఇక్కడి నుంచి తీసివేయాలని కోరుతున్నాను అని అన్నారు. ఏది ఏమైనా జిహెచ్ఎంసి అధికారులు ఈ సమస్యని పట్టించుకోవాలని ఏ. ఎం. న్యూస్, జూబ్లీహిల్స్ మీడియా ద్వారా స్థానికులు కోరుతున్నారు.

## ఎం.ఎల్.ఎ. వి.నవీన్ యాదవ్‌కు
## ఘన స్వాగతం పలికిన ఆలయ కమిటీ సభ్యులు

**ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :**



యూసఫ్ గూడా డివిజన్ శ్రీకృష్ణనగర్ లో ఉన్న శ్రీశ్రీశ్రీ ప్రసన్నాంజనేయ స్వామి, శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణం కు ఆలయ కమిటీ ఆహ్వాన మేరకు జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొదటిసారి ఆలయానికి వచ్చిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ కు ఘన స్వాగతం పలికారు ఆలయ కమిటీ సభ్యులు. మొదట ఆలయ ప్రధాన అర్చకులచే శాస్త్రోక్తకంగా స్వాగతం పలికి, హారతులు ఇచ్చి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయకమిటీ వారు వి.నవీన్ యాదవ్‌కు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వి.నవీన్‌యాదవ్ పుట్టినరోజు సోమవారం అని తెలుసుకొని అప్పటికప్పుడు ప్రత్యేక కేక్ తెప్పించి వి.నవీన్ యాదవ్ చే మందిర ప్రాంగణంలో ఆలయ అర్చకుల మధ్య, ఆలయ కమిటీ సభ్యుల మధ్య, యూసుఫ్ గూడా డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు,మహిళా నాయకురాల మధ్య కేక్ కట్ చేయించి, వారికి తినిపించి, వారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## ఢిల్లీ పబ్లిక్ స్కూల్ BMS
## భారతీయ మజ్దూర్ సంఘ్ కార్మికుల సంఘం సమావేశం..

**ఏ ఎం న్యూస్ ఓయూ :**




నాచారం డివిజన్ పరిధిలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ BMS భారతీయ మజ్దూర్ సంఘ్ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఉప్పల్ మాజీ శాసనసభ్యులు NVSS ప్రభాకర్ .ఈ కార్యక్రమంలో పాల్గొన్న మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ ,ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్, మీర్పేట్ హౌసింగ్ బోర్డు డివిజన్ అధ్యక్షులు రాంప్రదీప్, నాచారం డివిజన్ అధ్యక్షులు నవీన్ కుమార్, మల్కా ప్రకాష్, యోగేశ్వర్ రెడ్డి, అభిషేక్ గౌడ్, దయాగౌడ్, మంజులవాణి, DPS BMS కార్మికులు, డ్రైవర్లు,యూనియన్ సభ్యులు మరియు ఇతరులు.

### సికింద్రాబాద్ మండల తాసిల్దార్
## కార్యాలయంలో ఏసీబీ దాడులు..
### - రూ.లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడిన సర్వేయర్



**ఏ ఎం న్యూస్ /హైదరాబాద్ :**
సికింద్రాబాద్ మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అవినీతి నిరోదక శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. పిర్యాదు దారుడిని నుంచి రూఒక లక్ష లంచం సొమ్ము తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా మండల సర్వేయర్ కలువ కిరణ్ కుమార్, చైన్ మెన్ గా పనిచేస్తున్న మేకల భాస్కర్ లను పట్టుకున్నారు. వివరాలు ఇవి.. ఫిర్యాదుదారుని ఆస్తి సంబంధించిన నోటీసుపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా అధికారిక అనుకూలం చూపించేందుకు మండల సర్వేయర్ కిరన్ మొత్తం రూ.3 లక్షల లంచం డిమాండ్ చేశాడు. మొదటి విడతగా రూ.1 లక్షను చైన్ మెన్ భాస్కర్ ద్వారా స్వీకరించిన సమయంలో ఎసిబి అధికారులు లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. లంచం తీసుకోవడం ద్వారా ఇద్దరు అధికారులు తమ విధులను అక్రమంగా నిర్వహించి అనుచిత లాభం పొందేందుకు ప్రయత్నించినట్లు ఎసిబి పేర్కొంది. అనంతరం వారి ఇద్దరిని అరెస్ట్ చేసి నాంపల్లి ఎస్పీఈ,ఏసీబీ ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరచారు. కేసు దర్యాప్తులో ఉన్నందున ఫిర్యాదుదారుని వివరాలు భద్రత కోసము వెల్లడించడం లేదని ఏసీబీ అధికారులు తెలిపారు.ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేసిన పక్షంలో, ప్రజలు ఎసిబి టోల్ ఫ్రీ నంబర్ 1064 కు ఫిర్యాదు చేయాలని ఎసిబి విజ్ఞప్తి చేసింది. అదనంగా వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్, ట్విట్టర్ ద్వారా కూడా సంప్రదించవచ్చున్నారు. ఫిర్యాదుదారుల వివరాలను రహస్యంగా ఉంచుతామని ఎసిబి స్పష్టం చేసింది.


## వేములవాడలో కార్తీక దీపోత్సవం

**ఏ ఎం న్యూస్ ఓయూ:**



వేములవాడ శ్రీ రాజరాజేశ్వరి దేవస్థానంలో కార్తీక దీపోత్సవ వేడుకలు మంగళవారం కన్నుల పండుగ జరిగాయి. శ్రీ రాజరాజేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో 30మంది మహిళా సభ్యులతో కలిసి ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తితో దేవును భజన చేస్తూ శివనామ స్మరణతో... శ్రీ వేములవాడ రాజరాజేశ్వరి దేవాలయం ఆవరణలో దినమంతా శివలింగాకారం, ఓంకారం రూపంలో దీపాలను పేర్చి అందంగా పువ్వులతో అలంకరించారు. సాయంత్రం వెలిగించిన దీపాల వెలుగుల్లో రాజరాజేశ్వర దేవాలయ ఆవరణం కార్తీక దీపాల వెలుగుల్లో దే దివ్య మానంగా భక్తులకు దర్శనమిచ్చింది. ఈ కార్యక్రమంలో సేవా సమితి బృందం రజిత రెడ్డి ,రాణి సులోచన,అనిత సేవ సభ్యులుతో పాటు సుగుణ వృద్ధాప్య ఫౌండేషన్ బృందం సుగుణ,సుజాత ప్రతినిధులు పాల్గొన్నారు.

### రహీమున్నీస బేగం కుటుంబ సభ్యులను
## పరామర్శించిన టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్...



**ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :**
నవంబర్ 17 రోజున మక్కాలో ఉమ్రా యాత్ర ప్రయాణం సందర్భంగా జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో మరణించిన కూకట్పల్లి నియోజకవర్గంలోని అల్లాపూర్ డివిజన్ పద్మావతి నగర్ కు చెందిన రహీమున్నీస బేగం కుటుంబ సభ్యులను తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ స్థానిక నాయకులతో సందర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. అలాగే ప్రభుత్వం తరఫున కాంగ్రెస్ పార్టీ తరఫున అన్ని రకాల సహాయం అందిస్తామని పార్టీ ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మొయిజుద్దీన్, హుస్సేన్, జమీర్, నజీర్, సజ్జత్, అబ్దుల్లా, , మాధురి సాయి, శ్రీనివాస్ రెడ్డి, మస్తాన్ రెడ్డి ,రఫీ, ఇస్మాయిల్ , అడ్డు, సతీష్ రెడ్డి , సోహైల్ తదితరులు పాల్గొన్నారు.

### ఐసియులో చికిత్స పొందుతున్న
## మనిషాని పరామర్శించిన ఎర్రబెల్లి సతీష్ రావు...



**ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :**
భూదేవి హిల్స్ లో గత కొన్ని సంవత్సరాలుగా నివసిస్తున్న మనిషా అనే మహిళని అదే కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు మీ ఇళ్ళు రోడ్డు మీదకి కట్టారు కావున మీరు ఇల్లు కట్టుకున్న ప్రదేశంలో నుంచి కొంత జరగాల్సి ఉంటుంది లేదంటే మేమే కూల్చేస్తాము అంటూ గత కొన్ని రోజులుగా రకరకాలుగా వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. అయితే నిన్న అతనికి ఉన్న మంది మార్బలంతో వెళ్లి మనిషా అనే మహిళ వారి ఇంటికి వెళ్లి మీ ఇంటికి కొంత భాగం వరకు కూలగొట్టడం జరుగుతుందని చెప్పి వాళ్ళ ఇంటికి హద్దులు అని మార్కింగ్ ఇవ్వడంతో ఆ సమయంలో భయాందోళనకు గురైన ఆ మహిళ ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక ఆల్ అవుట్ లిక్విడ్ తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. వెంటనే విషయం తెలుసుకున్న ఆమె భర్త హుటాహుటిన జగద్గిరిగుట్ట లోని పద్మజ హాస్పిటల్ కి తరలించారు. ప్రస్తుతం ఐసీయూలో ( %×జఖ% ) చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న బీ.అర్.ఎస్ పార్టీ శేర్లింగంపల్లి సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు మంగళవారం హాస్పిటల్ కి వెళ్లి మనీషాని వారి కుటుంబ సభ్యులని పరామర్శించి ఎటువంటి భయాందోళనలకు గురి కావద్దు అంటూ ఎవరికి భయపడాల్సిన అవసరం లేదు చట్టం తనపనీ తను చేసుకుంటూ వెళుతుంద నీ భరోసా ఇచ్చారు. మీ ఇల్లు కూలగొట్టాల్సిన అవసరం ఎవరికీ లేదు మీకు తప్పకుండా మేము మా బి.ఆర్.ఎస్ పార్టీ తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చిన ఎర్రబెల్లి సతీష్ రావు కొంత ఆర్థిక సహాయాన్ని అందజేశారు.


# మహారాణి నయన అడుగు పెట్టింది

నందమూరి బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని ఓ చిత్రం తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'ఎన్‌బీకే 111' వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో కథానాయికగా లేడీ సూపర్ స్టార్ నయనతారను ఎంపిక చేశారు. మంగళవారం నయన్ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు చెబుతూ ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఈ సినిమాలో నయనతార మహారాణి పాత్రలో కనిపించనున్నట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. నయనతారకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ 'సముద్రమంత ప్రశాంతతను, తుపాను అంత బీభత్సాన్ని తనలో మోసే రాణి మా సామ్రాజ్యంలోకి అడుగుపెట్టనుంది' అంటూ వీడియో పంచుకున్నారు త్వరలోనే ఈ చిత్రం నుంచి మరిన్ని అప్‌డేట్స్ వస్తాయని వెల్లడించింది. నవంబర్ 26న ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానున్నట్లు తెలిపింది.




## త్వరలోనే ఉస్తాద్ భగత్ సింగ్ పూర్తి

### దర్శకుడు హరీష్ శంకర్ కీలక ప్రకటన




గబ్బర్‌సింగ్ తర్వాత పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ , హరీశ్ శంకర్ కాంబోలో వస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' కొన్ని సన్నివేశాలు మినహా ఈ చిత్రం షూటింగ్ దాదాపుగా పూర్తయింది. మరో పక్క పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సాంగ్‌లో వింటేజ్ లుక్‌ను రివీల్ చేశారు. మళ్లీ ఇప్పటిదాకా సినిమా గురించి ఎలాంటి అప్‌డేట్ లేదు. అయితే సినిమా నుంచి ఫస్ట్ సాంగ్ త్వరలోనే రిలీజ్ చేస్తామంటూ ఇటీవల టీమ్ చిన్న హింట్ ఇచ్చిన సంగతి తెలిసిందే! తాజాగా దర్శకుడు హరీష్ శంకర్ అధికారికంగా వెల్లడించారు. అల్లరి నరేష్ హీరోగా నటించిన '12ఎ రైల్వే కాలనీ' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హరీష్ శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా అప్‌డేట్ గురించి అడగ్గా... 'చిన్న కరెక్షన్... ఉస్తాద్ గురించి చిన్న న్యూస్ ఉండదు. పెద్ద న్యూస్ ఉంటుంది. డిసెంబరులో ఫస్ట్ సాంగ్ వస్తుంది. త్వరలోనే డేట్ చెబుతాం. డిసెంబర్ 31కి మీకు జోష్ వస్తుందందని చెప్పగా ఫ్యాన్స్ ఫుల్ జోష్ ఫీలయ్యారు. పవన్‌కల్యాణ్ సరసన రాశీఖన్నా, శ్రీలీల నాయికలుగా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇటీవల రాశీఖన్నా కూడా చిత్రీకరణ పూర్తి చేసుకుంది. అలాగే పవన్‌కు సంబంధించిన షూట్ మొత్తం పూర్తయింది.

## రాజశేఖర్ సరసన మరోమారు రమ్యకృష్ణ



యాంగ్రీ మ్యాన్ రాజశేఖర్ ఈమధ్య జోరు పెంచిన విషయం తెల్సిందే. హీరోగానే కాకుండా సపోర్టింగ్ రోల్స్ లో కూడా చేయడం మొదలుపెట్టారు. ఇప్పటికే ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్ సినిమాతో ఎంట్రీ ఇచ్చిన రాజశేఖర్ కు అదేమీ ఆశించిన ఫలితాన్ని అందించలేదు. ఇక ప్రస్తుతం బైకర్ సినిమాలో మంచి పాత్ర చేస్తున్నాడు. ఒకపక్క సపోర్టింగ్ రోల్స్ లో నటిస్తూనే ఇంకోపక్క హీరోగా కూడా రాబోతున్నాడు. తాజా సమాచారం ప్రకారం తమిళ్ లో సూపర్ హిట్ అయిన లబ్బరు పందు సినిమాను రీమేక్ చేస్తున్నట్లు తెలుస్తోంది. హరీష్ కళ్యాణ్, దినేష్, శ్వాసిక, సంజన కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమా గతేడాది రిలీజ్ అయ్యి భారీ విజయాన్ని అందుకుంది. ఇక ఇదే సినిమా ఓటీటీలో తెలుగు వెర్షన్ లో కూడా రిలీజ్ అయ్యి ఇక్కడ కూడా మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఆ సినిమానే రాజశేఖర్ రీమేక్ చేస్తున్నాడు. ఇందులో దినేష్ పాత్రలో రాజశేఖర్ నటిస్తుండగా.. హరీష్ కళ్యాణ్ పాత్రలో విశ్వదేవ్ రాచకొండ నటిస్తున్నాడు. ఇక హీరోయిన్ గా రాజశేఖర్ కుమార్తె శివాని నటిస్తుంది. సినిమా మొత్తానికి హైలైట్ అంటే.. శ్వాసిక పాత్రనే అని చెప్పాలి. క్రికెట్ అంటే పిచ్చి ఉన్న భర్తను.. ఆ పిచ్చి మాన్పించి, అందరి ముందు్న గౌరవంగా నిలబడాలని, ప్రేమించి పెళ్లి చేసుకొని బయటకు వచ్చాకా.. తన కుటుంబానికి అల్లుడును గొప్పగా చూపించాలని ఆరాటపడే పాత్రలో ఆమె ఎంతో అద్భుతంగా నటించింది. ఆ పాత్ర ఎవరు చేస్తారు అనే డైలమా నేటితో తీరిపోయింది. రాజశేఖర్ భార్యగా శివగామి రమ్యకృష్ణను అనుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆ పాత్రకు ఆమె పర్ఫెక్ట్ అని చెప్పొచ్చు. అంతేకాకుండా రాజశేఖర్– రమ్యకృష్ణ జోడీకి సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. అల్లరి ప్రియుడు లాంటి హిట్ తరువాత వీరిద్దరి కాంబోలో దీర్ఘ సుమంగళీ భవ, బలరామ కృష్ణులు సినిమాలు వచ్చాయి. 1998 తరువాత ఈ జంట మళ్లీ కలిసి కనిపించలేదు. దాదాపు 27 ఏళ్ళ తరువాత మరోసారి ఈ జంట ఈ రీమేక్ తో కలవనున్నారు. అప్పటి కెమిస్ట్రీ ఇప్పుడు కూడా వర్క్ అవుతూ అవుతుందని అంటున్నారు. మరి ఇందులో ఎంత నిజముంది అనేది తెలియాల్సి ఉంది.

Mana Cinemalu

## పట్టాలకెక్కనున్న జై హనుమాన్




తేజా సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన 'హనుమాన్' కి సీక్వెల్‌గా 'జై హనుమాన్' చిత్రాన్ని ప్రకటించారు దర్శకుడు ప్రశాంత్. ఇందులో ప్రధాన పాత్రలో కన్నడ స్టార్ నటుడు రిషబ్ శెట్టి పోషించనున్నారు. ఈ సినిమాను అనౌన్స్ చేసి చాలా కాలమే అయింది. దీనికి సంబంధించి రిషబ్ లుక్‌ను కూడా విడుదల చేశారు. కానీ ఇంకా కార్యరూపం దాల్చలేదు. అయితే రిషబ్ బిజీగా ఉండటం, డేట్స్ కుదరక ఈ సినిమా ఇంకా సెట్స్ మీదకి వెళ్లలేదని టాక్. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రం పట్టాలెక్కేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. వచ్చే ఏడాది జనవరి నుంచి రిషబ్ వరుసగా ఐదారు నెలలు ప్రశాంత్ వర్మకి కాల్షీట్స్ ఇచ్చినట్లు చిత్ర బృందం నుంచి సమాచారం అందింది. ఈ చిత్రం కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు ఇది శుభవార్తే అవుతుంది. అయితే ఈ సినిమా డిలే అవ్వడానికి దర్శకుడు ప్రశాంత్ వర్మ, ÷–రెమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత నిరంజన్ రెడ్డితో ఉన్న విభేదాలు, ఆర్థిక లావాదేవీలు కూడా ఓ కారణమని తెలుస్తుంది. అయితే దర్శకనిర్మాతలు ఇద్దరు ఆ రచ్చను ఫిల్మ్‌ఛాంబర్‌లో పెట్టారు. వారే ఇష్యూకి సొల్యూషన్ ఇస్తారని దర్శకుడు ఇటీవల ఓ లేఖ ద్వారా తెలిపారు.

### జక్కన్న వ్యాఖ్యలపై

## వానరసేన మండిపాటు




ఇటీవల హైదరాబాద్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగిన 'వారణాసి' సినిమా టైటిల్స్ గ్లింప్స్ వేడుకలో జక్కన్న చేసిన వ్యాఖ్యలు తమ మనోభావాలను దెబ్బతీశాయని రాష్ట్రీయ వానరసేన ఎస్‌ఎస్ రాజమౌళిపై సరూర్ నగర్ పోలీసుకు ఫిర్యాదు ఫిర్యాదు చేశారు. ఆయన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని, రాజమౌళి పై కేసు నమోదు చేయాలని వినతి పత్రం అందజేశారు. భవిష్యత్తులో ఎవరూ హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేయకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ వానరసేన సంఘం సభ్యులు పోలీసులను కోరారు. రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగిన కార్యక్రమంలో సాంకేతిక సమస్య తలెత్తింది. రాజమౌళి బాధతో పాటు అసహనానికి గురయ్యారు. స్టేజి మీద ఆయన మాట్లాడుతూ.. 'నాకు దేవుడి మీద నమ్మకం లేదు. నా తండ్రి విజయేంద్రప్రసాద్ నాతో మాట్లాడుతూ.. 'టెన్షన్ పడకు. అంతా హనుమ చూసుకుంటాడు. వెనకుండి నడిపిస్తాడు' అన్నారు. కానీ, సాంకేతిక లోపం కారణంగా ఈవెంట్ ఆగినపుడు ఇలాగేనా నడిపించేది అని కోపం వచ్చింది. నా భార్య రమాకు హనుమాన్ అంటే చాలా ఇష్టం. కానీ, ఎందుకిలా అయిందని నాకు కోపం వచ్చింది' అని అన్నారు. ఇదిలా ఉండగా మరో చిక్కులో ఇరుక్కున్నారు రాజమౌళి. హనుమంతుడిపై చేసిన వ్యాఖ్యలు వివాదం కొనసాగుతుండగా 'వారణాసి' టైటిల్ పై ఫిల్మ్‌చాంబర్‌లో మరో నిర్మాత ఫిర్యాదు చేశారు. ఈ టైటిల్ తాను ఎప్పుడో రిజిస్టర్ చేసినట్లు తెలిపారు.